క్లుప్తంగా

ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం దేవాలయ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సాయిరెడ్డిగారి వెంకట్‌రెడ్డి, భజన భక్తుల ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన తలారి నర్సింలు తన సొంత నిధులతో చండూర్ గ్రామస్తుల పేర్లు వచ్చేలా క్యాలెండర్ ముద్రించారన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, రమేశ్, మల్లేశం, అంజయ్య, శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): రైతు భరోసా పథకం ద్వారా రైతులకు ఇస్తామన్న ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, పీఏపీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి సాగు కోసం రైతులకు పెట్టుబడి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి సాగు కోసం కాంగ్రెస్ రైతు భరోసా ద్వారా ఇస్తామన్న డబ్బులు నేటికి రాలేవని వాపోయారు.

కరపత్రాల ఆవిష్కరణ

రామాయంపేట(మెదక్): జనవరి మూడున హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆరో వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ శుక్రవారం సంఘం కార్యకర్తలు రామాయంపేటలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం, దాని అనుబంధ సంస్థల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కీసరి సిద్దరాంలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కీసరి స్వామి, మహేశ్, కుమార్, రత్నం, తదితరులు పాల్గొన్నారు.


దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికులపై దాడి చేసి వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి శుక్రవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని దొంతి పంచాయతీ కార్మికులు శంకర్, బాబు, గంగయ్యపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడికి పాల్పడినట్లు చెప్పారు. రాజు అనే వ్యక్తి ఇసుకను దొంగతనంగా తరలిస్తుండగా పంచాయతీ కార్మికులు శంకర్, బాబు, గంగయ్య అడ్డుకున్నారు. దీంతో అతను వారిపై దాడి చేశారు. ఈ మేరకు రాజుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిధులు మంజూరు చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్

తూప్రాన్: ప్రభుత్వం తూప్రాన్ మున్సిపల్ అభివృద్ధికి కేటాయించిన రూ.25 కోట్ల నిధులను నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం తూప్రాన్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్ పర్యటనలో తూప్రాన్ మున్సిపల్ అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తుచేశారు. ఆ నిధులతో పట్టణంలోని ఆయా వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు టేండర్ల ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. ప్రజల అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖాజామొహినోద్దీన్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సజావుగా ప్రజాపాలన

ఆర్డీఓ శ్రీనివాసులు

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమం నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సజావుగా సాగుతుందని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన అమలు కోసం డివిజన్ పరిధిలో ఆయా మండలాల్లో అధికారులను పలు బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు శుక్రవారం నుంచి ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలు లబ్ధిదారులకు గ్రామసభల కన్న ముందుగానే అందజేసే పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ సిబ్బంది అందజేసిన ఫారాలు నింపి గ్రామంలో నిర్వహించే గ్రామసభలో అధికారులకు అందజేయాలని ప్రజలను కోరారు. కాగా వ్యవసాయ భూములు ఏ గ్రామంలో ఉన్నా.. ఆయా భూముల పట్టాదారులు తమకు ఆధార్‌కార్డు ఉన్న గ్రామం, పట్టణంలోనే రైతు భరోసా కోసం దరఖాస్తు చేయాలని, దరఖాస్తు ఫారంతో పాటు భూముల వివరాలు, పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్‌లు జతచేయాలని వివరించారు. కాగా రేషన్‌కార్డు లేని వ్యక్తులు తమ కుటుంబ యజమాని పేరుతో ఉన్న రేషన్ కార్డు నంబర్‌ను తమ దరఖాస్తు ఫారంలో నమోదు చేసి, తను పొందాలను కుంటున్న పథకాల కోసం దరఖాస్తు చేయాలని ఆయన చెప్పారు. కాగా కొత్త రేషన్ కార్డు కావాల్సిన వ్యక్తులు తెల్ల కాగితంపై దరఖాస్తు రాసి ప్రజాపాలన సభలో అధికారులకు అందజేయాలన్నారు. ధరణి వ్యవసాయ భూమి సమస్యలుంటే వాటిని తెల్లకాగితంపై రాసి గ్రామ సభలో అందజేయాలని తెలిపారు.



పెద్దశంకరంపేట(మెదక్): బూర్గుపల్లిలో మాట్లాడుతున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. మండల పరిధిలోని బూర్గుపల్లి, బుజ్రాన్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అధికారులు ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సరిత, బూదెమ్మ విఠల్, గ్రామ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చెవెళ్ల, కాయిదంపల్లి, సీతానగర్, బహిరన్‌దిబ్బ గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కరుణ, ఎంపీడీఓ శంకర్, ఏపీఎం నాగరాజు, సర్పంచ్ బేతయ్య పాల్గొన్నారు.

త్వరగా అమలు చేయాలి

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తులతో సరిపెట్టుకోకుండా త్వరగా పథకాలను అమల్లోకి తేవాలని ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ప్రజాపాలన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోదావరితో పాటు ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఏపీఓ మహిపాల్ రెడ్డి, ఎంపీఓ లక్ష్మీ నర్సింలు,ఏఓ శ్వేతా కుమారి, పంచాయత్ రాజ్ ఏఈ ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.మరోవైపు ఏటిగడ్డ మాందాపూర్, కోనాపూర్ గ్రామాల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేశ్,తహసీల్దార్ గఫర్ మియా పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

రేగోడ్(మెదక్): మండలంలోని చౌదర్‌పల్లి, కొత్వాన్‌పల్లి, ఆర్.ఇటిక్యాల, జగిర్యాల గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. ఇందులో 504 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదగిరి , పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, తహసీల్దార్ బాలలక్ష్మీ, ఎంపీడీఓ సీతారావమ్మ, ఎస్ఐ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హవేళీఘణాపూర్(మెదక్): మెదక్ మండలం మల్కాపూర్‌లో ప్రజాపాలనను మెదక్ ఆర్డీఓ రాజేశ్వర్ పరిశీలించారు. మెదక్, హవేళిఘణాపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, నారాయణ, ఎంపీడీఓలు శ్రీరామ్, శ్రీరాములు సర్పంచ్‌లు మోహన్, సుభాష్, సౌందర్య పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ, మండల పరిధిలో ప్రజాపాలన ప్రశాంతంగా జరిగింది. లక్ష్మాపూర్, ప్రగతి ధర్మారం, శివాయపల్లి గ్రామాల్లో, మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో చేపట్టిన ప్రజాపాలన నిర్వహించారు.

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజాపాలనలో ప్రతి దరఖాస్తును స్వీకరిస్తున్నామని జెడ్పీ సీఈఓ వెంకటశైలేష్ అన్నారు. మండలంలోని గౌతోజీగూడెంలో ప్రజాపాలన కౌంటర్‌ను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నర్సింలు, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, డీటీ కౌశిక, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, రేఖమల్లేశ్, రేణుక, నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు రేణుకుమార్, యాదగిరిగౌడ్, ఆంజనేయులుగౌడ్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రేగోడ్(మెదక్): దరఖాస్తులను స్వీకరిస్తున్న జెడ్పీటీసీ యాదగిరి



అల్లాదుర్గం(మెదక్): కాయిదంపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారిణి



గౌతోజీగూడెంలో అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకటశైలేశ్



రామాయంపేటలో మున్సిపల్ చైర్మన్‌కు దరఖాస్తు ఫారం అందజేస్తున్న గ్రామస్తులు

సర్వర్ తిప్పలు

నర్సాపూర్: ఈ కేవైసీ నమోదుకు సర్వర్ శుక్రవారం సరిగా పని చేయకపోవడంతో గ్యాస్ వినియోగదారులు తిప్పలు పడ్డారు. ఈ కేవైసీ నమోదు కోసం ఆయా గ్రామాలకు చెందిన హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ద్వారక గ్యాస్ ఏజెన్సీ కార్యలయానికి వచ్చారు. కాగా ఉదయం నుంచి సర్వర్ నెమ్మదిగా పని చేయడంతో ఈ కేవైసీ నమోదు నిదానంగా కొనసాగడంతో వినియోగదారులు గంటల తరబడి కార్యలయం వద్ద నిరీక్షించాల్సి వచ్చింది.

కార్యాలయానికి రావొద్దు: డీలరు శ్రీనివాస్

వినియోగదారుల ఇంటి వద్దకు వెళ్లి ఈ కేవైసీ పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్‌పీ గ్యాస్ డీలరు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు తమ కార్యాలయానికి రావొద్దని చెప్తున్నా.. ప్రజలు రోజు ఇక్కడికి వస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. తాము ఇంటింటికీ వెళ్లి ఈ కేవైసీ పూర్తి చేస్తామని అన్నారు.



నర్సాపూర్‌లోని గ్యాస్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న వినియోగదారులు

విద్యుత్ సమస్యలు లేకుండా పటిష్ట చర్యలు

కౌడిపల్లి(నర్సాపూర్): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించి సమస్యలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ జానకీరాం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం కౌడిపల్లిలో పర్యటించి గ్రామస్తులను విద్యుత్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు గ్రామస్తులు వారికి లూజ్‌వైరింగ్, సర్వీస్‌వైర్, వీధిదీపాలకు ప్రత్యేకవైర్‌కు సంబంధించిన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాలు, పట్టణాల్లో గృహాలు, వ్యాపార సంస్థలతో పాటు వ్యవసాయానికి నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైన సమస్యలు ఉంటే తెలియజేయాలని చెప్పారు. వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్‌పోల్స్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కృష్ణారావు, ఏడీ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈ కోటేశ్వరరావు, ఏఈఈ సాయికుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్, లైన్‌మెన్‌లు శివకుమార్, శివరాజ్, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ జానకీరాం

సమస్యల పరిష్కారానికి కృషి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం శ్రమిస్తుందని విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు అన్నారు. మండల పరిధిలోని అంతారం గ్రామంలో శుక్రవారం ప్రజాపాలనలో భాగంగా గ్రామస్తులు గ్రామంలోని విద్యుత్ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలపై గ్రామస్తులు ఇచ్చిన దరఖాస్తులు పరిశీలించామన్నారు. వాటిని ఉన్నతాధికారులకు పంపించి, త్వరలోనే సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సబ్ ఏఈ సల్మాన్, సర్పంచ్ అశోక్‌గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఏఈ రాంబాబుకు దరఖాస్తు ఇస్తున్న గ్రామస్తులు

రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

డీఈఓ రాధాకిషన్

కౌడిపల్లి(నర్సాపూర్): రేషన్ కార్డు లేనివారు తెల్ల కాగితంపై వివరాలు రాసి దరఖాస్తు చేయాలని డీఈఓ, మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్, తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి, హరిచంద్‌తండా, జాజితండా, కొత్తచెరువుతండాలలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు దరఖాస్తుదారులకు రశీదులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల, ఆయాగ్రామాల సర్పంచ్‌లు రజినీ, లక్యానాయక్, రమేష్‌నాయక్, పద్మదూద్యానాయక్, ఎంపీటీసీ శివ్వయ్య, విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరావ్, డిప్యూటీతహసీల్దార్ తారాబాయ్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలక్ష్మీ, ఏపీఎం సంగమేశ్వర్, ఏపీఓ పుణ్యదాస్, ఐసీడీఎస్ సూపర్‌వైర్జ్ శశికళ, లక్ష్మీ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



హరిచంద్‌తండాలో దరఖాస్తు దారులకు రశీదు ఇస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో గ్రామ దేవతల పూజలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠతో పాటు పోత లింగమయ్య విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో నర్సాపూర్‌ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, ఆత్మక మిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, నాయకులు కమలపూల్‌సింగ్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



బోనాలు సమర్పిస్తున్న భక్తులు

రామతీర్థక్షేత్ర అక్షింతల ఊరేగింపు

పెద్దశంకరంపేట(మెదక్): అయోధ్యలో వచ్చే నెలలో జరగనున్న శ్రీ రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా పెద్దశంకరంపేట మండల కేంద్రంలో శుక్రవారం అక్షింతలను మంగళవాయిద్యాల మధ్య శ్రీ రామతీర్థ క్షేత్ర సభ్యులు పురవీధులగుండా ఊరేగించారు. శుక్రవారం రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాలకు ప్రత్యేక కళాశాలలో ఉంచిన అక్షింతలను సభ్యులకు అందించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ కనకరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు ఆర్ఎస్.సంతోష్, కె.రవీందర్, ఎంపీటీసీలు వీణసుభాష్‌గౌడ్, కోణం విఠల్, దత్తు, సభ్యులు సీతారాం, వీరప్ప, సతీష్‌గౌడ్, శ్రీహరి, కృష్ణమూర్తి, సాయిలు, రవీందర్, పురోహితులు గుడి చంద్రశేఖర్, రామాచారి, కృష్ణశర్మ, మహేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామక్షేత్ర అక్షింతల శోభాయాత్ర

నేడు రేగోడ్‌లో ప్రజాపాలన గ్రామసభ

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో నేడు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాపాలన గ్రామసభ నిర్వహించనున్నట్లు కోఆప్షన్ సభ్యుడు చోటుమియా, పంచాయతీ కార్యదర్శి రమేశ్ శుక్రవారం తెలిపారు. వంద కుటుంబాలకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కు తీర్చుకున్న తుక్కాపూర్ గ్రామస్తులు



అమ్మవారి సన్నిధిలో గ్రామస్తులు

కొల్చారం(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి గెలుపొందడంతో తుక్కాపూర్ గ్రామస్తులు శుక్రవారం అమ్మవారిని దర్శించుకొని, సన్నిధిలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మల్లయ్య, నాయకుల రవీందర్, అంజయ్య, గంగయ్య, దిగంబర్, చంద్రప్ప, సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దుర్తి(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని ఎం.జలాల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మదుసూధన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి శ్రీశైలం(36) ఈ నెల 20న పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడు. పంటపొలం వద్ద పడి ఉన్న ఆయనను సోదరుడు గుర్తించి కుటుంబ సభ్యుల సహకారంతో అదేరోజు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీశైలం (ఫైల్)

విద్యార్థులకు ప్రత్యేక బస్సులు నడపాలి

చేగుంట(తూప్రాన్): విద్యార్థులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఏబీవీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్ అన్నారు. శుక్రవారం చేగుంటలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సులను నడపడంపై విద్యార్థులు సమయానికి విద్యాసంస్థలకు చేరుకోవడం లేదన్నారు. సాయంత్రం ఇంటికి చేరుకోవడానికి రాత్రి 9 అవుతుందన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు సాయివంశీ, నవీన్, భరత్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

యువకుడు అదృశ్యం

తూప్రాన్: కిరాయి కోసం వాహనంలో ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని వెంకటాయిపల్లిలో ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన ఉప్పనగళ్ల వెంకటేశ్ (30) అనే యువకుడు ఈ నెల 27న బుధవారం కిరాయి కోసం తన వ్యాన్‌లో ఉదయం వెళ్లిన వ్యక్తి రెండు రోజులు అయినా తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో భార్య నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ మహిళలకు సూక్ష్మపోషకాల అందజేత



చేగుంట(తూప్రాన్): మండలంలోని బోనాల్ గ్రామంలో మహిళా రైతులకు సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సూక్ష్మపోషకాల కిట్‌లను అందించారు. ఈ సందర్భంగా సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రుచిసింగ్ మాట్లాడుతూ.. మహిళా రైతులు కూరగాయల పంటలు ఇతర వ్యాపార పంటలను వేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. గ్రామంలోని రైతుల పొలాల మట్టి నమూనాల ఆధారంగా వారికి సూక్ష్మపోషకాలు అందించినట్లు తెలిపారు. వ్యవసాయ పరికరాలు, విత్తనాలకు హైటెక్ సీడ్ సంస్థ సహకారం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మహిళలతో పాటు నారాయణ, వెంకట్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

చిన్నశంకరంపేట(మెదక్): ఆలయాలు, మానసిక ప్రశాంతతకు నిలయాలని, ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని గవ్వలపల్లిలో గణపతి ఆలయ వార్శికోత్సవ వేడుకలకు ఆయన హాజరై భక్తులకు ఉపదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరిలో దైవచింతన ఉన్నట్లయితే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు. అనంతరం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ ఆలయాన్ని సందర్శించి ఆధ్యాత్మిక క్యాలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు హనుమంతరావు, ఉదయభాస్కర్, కాంగ్రెస్ నాయకులు యాదవరావు, గంగ నరేందర్, రాజిరెడ్డి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



◆ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



నర్సాపూర్ రూరల్: భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయి తాగునీరు వృథాగా పోతోంది. శుక్రవారం నర్సాపూర్ - మెదక్ రహదారిలోని రెడ్డిపల్లి పంట పొలాల పక్క నుంచి ఉన్న భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయి శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తాగునీరు వృథాగా పోతున్నా.. ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు తెలిపారు.

◆ ఉపాధ్యాయ క్యాలెండర్ ఆవిష్కరణ

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయా ప్రభుత్వ పాఠశాలలకు నూతన సంవత్సర క్యాలండర్‌లను అందజేశారు. మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి అనిల్‌గౌడ్, జిల్లా బాధ్యుడు రాములు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

◆ రామ మందిర నిర్మాణం చారిత్రాత్మకం

గజ్వేల్‌రూరల్: అయోధ్యలో రామ మందిర నిర్మాణం చారిత్రాత్మకమని అయోధ్య ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు అన్నారు. పట్టణంలోని మురళీకృష్ణాలయంలో శుక్రవారం అయోధ్య ట్రస్ట్‌కు రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో భక్తులు లిఖించిన కోటి 16 లక్షల రామ నామాలను పూజలు చేసి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 ఏళ్ల నాటి కల నెరవేరే సమయం ఆసన్నమైందన్నారు.